సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



రూ.3 లక్షల విరాళం


గోకవరం: గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి భర్త కృష్ణ జ్ఞాప కార్థం మేడా వసుంధర (గోకవరం) మంగళ వారం రూ.3 లక్షల విరాళం సమర్పించారు.



బాలల ప్రతిభ.. అదుర్స్

కోనసీమ జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రాజెక్టుల తయారీలో ప్రతిభను చూపారు. మొత్తం 9 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. 8లో▸

డెల్టాలకు 11,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు మంగళవారం 11,800 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

రూ.40 వేల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కృష్ణచైతన్య

ఆత్రేయపురం: ర్యాలి పుణ్యక్షేత్రంలో వివిధ కూడళ్ల వద్ద శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి మార్గం సూచించేలా బోర్డుల ఏర్పాటుకు గ్రామానికి చెందిన బొచ్చుల సుబ్బారావు రూ.40 వేల విరాళం అందించారు. ఈ విరాళంతో ఇనుప ఆర్చ్ గేటు నిర్మించి, ర్యాలి బ్రిడ్జి వద్ద, మార్కెట్ కూడలిలో దేవస్థానానికి మార్గం సూచించేలా ఐరన్ బోర్డులు నిర్మిస్తామని ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల - గుత్తెనదీవి పంట కాలువలో పూడికతీత పనులను కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం పరిశీలించారు. కాలువ ఆక్రమణలకు గురై, దిగువనున్న గుత్తెనదీవి, జి.వేమవరం, ఎదుర్లంక, కొమరగిరి గ్రామాల ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఢిల్లీ నారాయణ ఆధ్వర్యాన ఆయా ప్రాంతాల రైతులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి, తమ ఇబ్బందులు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన.. తన ప్రత్యేక నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలువలో ఆక్రమణలను తొలగించి పూడికలు తీశారు. ఈ పనులను కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం పరిశీలించి, కాలువకు నీరు వదిలారు. తమ సమస్య పరిష్కారానికి సహకరించిన కలెక్టర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ-పబ్లిషింగ్‌పై శిక్షణ

అమలాపురం రూరల్: అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ టూల్స్ ఫర్ ఈ-పబ్లిషింగ్ కోర్సులో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ప్రొఫెసర్ బాలమోహనదాస్ సెమినార్ హాలులో శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 11 గంటలకు ఈ శిక్షణ ప్రారంభమవుతుందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ డాక్టర్ ఇ.శ్రీనివాసరెడ్డి ఈ శిక్షణ ఇస్తారన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా రంగాల్లో ఆధునిక సాంకేతిక విధానాలపై వర్కింగ్ జర్నలిస్టులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను మీడియా అకాడమీ గుర్తించిందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ శిక్షణకు గురువారం సాయంత్రం లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పేర్లు, తాము పని చేస్తున్న సంస్థ పేరును ఈ నెల 28 లోగా 91541 04393 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఫొటోగ్రఫీ పోటీలో బహుమతి



అవార్డు పొందిన చిత్రం



కొండపల్లి నరేష్

కాకినాడ సిటీ: ఢిల్లీలో జరిగిన ఫొటోగ్రఫీ పోటీల్లో కాకినాడకు చెందిన కొండపల్లి నరేష్‌కు అవార్డు దక్కింది. ఆర్ట్ ఫొటోగ్రఫీ విభాగంలో గ్రామీణ జీవనశైలిపై ఆయన తీసిన ఛాయా చిత్రాలకు ఈ అవార్డు లభించింది. ఢిల్లీలోని క్రియేటివ్ ఆర్ట్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం జరిగిన వేడుకల్లో ప్రముఖ సినీ దర్శకుడు అశోక్ తల్వార్, డాక్టర్ ఓపీ శర్మ, అసెంశర్మల చేతుల మీదుగా నరేష్ ఈ అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నారు. తనను ఆర్ట్ ఫొటోగ్రఫీలో ఎంతో ప్రోత్సహించిన టీఎస్ రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తనను ముందుకు నడిపించిన కాకినాడకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఎస్వీ అరుణ్‌కుమార్‌కు, కాకినాడ కెమెరా క్లబ్ ప్రెసిడెంట్ జీఎస్ గణేష్ ప్రసాద్‌లకు కూడా నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆటహోసంగా..

- మొదలైన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు
- జిల్లా వ్యాప్తంగా శ్రీకారం చుట్టిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆటలు ఆడుతూ అలరించిన వైనం
- రామచంద్రపురంలో పోటీలను ప్రారంభించిన మంత్రి వేణు



ద్రాక్షారామలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

సాక్షి, అమలాపురం: అట్టడుగు స్థాయిలో ఉన్న వారి క్రీడా ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో.. క్రీడలు, వ్యాయామంపై మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం అవగాహన కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వీటికి అద్వితీయ స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ జరిగే ఈ పోటీలను జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆడి అలరించారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకూ ఈ పోటీలు జరగనున్నాయి.


ఈ పోటీలకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించిన విషయం తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 1,17,420 మంది క్రీడాకారులతో ఈ క్రీడా పోటీలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1,16,171 మంది పేర్లు నమోదు చేయించుకున్నారు. వీరితో 88,274 జట్లు ఏర్పాటు చేశారు. వీరికి స్త్రీ, పురుష విభాగాల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పలు పోటీలను ఎంపిక చేసిన ఖాళీ స్థలాల్లోను, క్రికెట్, ఖోఖో వంటి క్రీడలను అందుబాటులో ఉన్న జెడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 515 గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల మహిళలు సైతం క్రికెట్ ఆడేందుకు ముందుకు రావడం విశేషం. స్థానికంగా జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

- రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం కొంతసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను, క్రీడాభిమానులను అలరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారుల ఉజ్వల భవిత కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ పోటీల ద్వారా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయిలో కూడా క్రీడాకారుల ప్రతిభను గుర్తించే అవకాశముందని చెప్పారు.
- కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం మండలం గోపాలపురం, ఆత్రేయపురం మండలం లొల్ల ఉన్నత పాఠశాలల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కొంతసేపు వాలీబాల్, ఇతర క్రీడలు ఆడి అలరించారు.
- అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ క్రీడా సంబరాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడల్లో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ, ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు ఐదు క్రీడాంశాల్లో నాలుగు దశల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరగనున్నాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో వంటి ఐదు విభాగాల్లో క్రీడా పోటీలను ప్రారంభించారన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట మహా క్రీడా యజ్ఞం తలపెట్టారన్నారు. ఇది క్రీడా చరిత్రలో అతి పెద్ద మైలురాయి అని, ఒకే ఈవెంట్‌లో లక్షలాది మంది క్రీడాకారులు పోటీ పడటం ఎప్పుడూ జరగలేదని చెప్పారు. జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా నోడల్ అధికారి ఎస్.నూపుర్ అజయ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం ఆర్‌డీఓ కేశవవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- అల్లవరం మండలం గోడిలంక ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఈ పోటీలను ప్రారంభించారు.
- ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.
- పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించి, వాలీబాల్ ఆడారు.
- రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం ఏఎఫ్‌డీటీ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడారు.



అమలాపురంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభిస్తూ క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రకృతిలో పరమాత్మను చూడటమే మన సంప్రదాయం



సామవేదం షణ్ముఖశర్మ

రాజమహేంద్రవరం రూరల్: చెట్టు, పుట్ట, రాయిరప్పా, నీరు, నిప్పు.. ఇలా అన్నింటిలో పరమాత్మను చూడటం, అన్నింటినీ పూజించడం భారతీయ సంప్రదాయమని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో ఆయన శ్రీరామాయణ ప్రవచనం 14వ రోజైన మంగళవారం కూడా కొనసాగింది. 'గంగ, యమున నదులను దాటుతున్న సీతాదేవి ఆయా నదులకు నమస్కరించి, మొక్కింది. యమున దాటాక కనపడిన పెద్ద వృక్షానికి కూడా పూజలు చేసింది. చిత్రకూట పర్వతం వద్దకు వెళ్తున్న సీతారామలక్ష్మణులు వాల్మీకి ఆశ్రమాన్ని దర్శించారు. చిత్రకూటం వద్ద రాముని సూచనలపై లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. రాముడు వాస్తు పూజలు నిర్వహించాడు. నిర్మాణానికి భూమిని తవ్వుతున్న సమయంలో కొన్ని ప్రాణులకు హాని జరుగుతుంది. ఈ దోషం తొలగిపోవడానికి వాస్తు పూజలు చేయాలి' అని రామాయణ సన్నివేశాలను సామవేదం వివరించారు. రామాయణంలో జ్యోతిష, వాస్తు, శకున శాస్త్ర అంశాలు అనేకం కనపడతాయని చెప్పారు. 'అయోధ్యకు తిరిగి వచ్చిన సుమంత్రుడు కళావిహీనమైన నగరాన్ని చూశాడు. దశరథుని వద్దకు వచ్చిన అతడు.. రాముడు తల్లిదండ్రులకు శిరసు వంచి నమస్కరిస్తున్నానని చెప్పమన్నాడని తెలిపాడు. భరతునితో తల్లులందరినీ సమానంగా చూడమన్నాడని చెప్పాడు. లక్ష్మణుడు బుసలు కొడుతూ దశరథుని నేను తండ్రిగా భావించడం లేదు. ఏ తప్పు చేశాడని రాముని అడవులకు పంపారు? నాకు తండ్రి, దైవం, బంధువు, ప్రభువు, నా సర్వస్వం రాముడే అని సందేశం పంపాడు. సీతమ్మ తల్లి ఏమీ మాట్లాడలేదు. మనస్సు పూర్తిగా రామునిలో లీనమైనందున ఆమె నిర్జనారణ్యంలో సైతం ఆనందంగా ఉందని చెప్పాడు. దశరథుడు రాముని స్మరిస్తూ ప్రాణాలు వదిలాడు. ఆ సమయంలో ఆయన వద్ద ఒక్క కొడుకూ లేడు' అని సామవేదం అన్నారు. కానీ భగవంతుని స్మరణలో, రామనామం ధ్యానిస్తూనే ప్రాణత్యాగం చేశాడని చెప్పారు. కష్టాల్లో సైతం ధర్మాచరణ వదలని జీవితమే సార్థకమని అన్నారు.

సత్యదేవునికి సిరుల వాన

- కార్తికంలో దండిగా ఆదాయం
- అన్ని విభాగాల ద్వారా రూ.20.60 కోట్ల రాబడి
- గత ఏడాది కంటే రూ.65 లక్షలు అధికం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారికి ఈ ఏడాది కార్తిక మాసం సిరుల వాన కురిపించింది. గత ఏడాది కార్తికంలో రూ.19.95 కోట్లు రాగా, ఈసారి సుమారు రూ.65 లక్షలు పెరిగి, ఏకంగా రూ.20.60 కోట్ల మేర రాబడి వచ్చిందని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ మంగళవారం తెలిపారు. కార్తికంలో రత్నగిరి భక్తజన సంద్రంగా మారిన విషయం విదితమే. ఈ పవిత్ర మాసంలో సత్యదేవుని దర్శనానికి లక్షలాదిగా భక్తులు తరలి వచ్చారు. వారు హుండీల్లో వేసిన కానుకలతో పాటు వివిధ విభాగాల ద్వారా స్వామివారికి దండిగా ఆదాయం సమకూరింది.

హుండీల ఆదాయం రూ.2.93 కోట్లు

కార్తిక పౌర్ణమి అనంతరం సత్యదేవుని ఆలయంలోని హుండీల ఆదాయాన్ని తొలి విడతగా లెక్కించారు. అప్పుడు రూ.1.81 కోట్ల రాబడి వచ్చింది. రెండో విడతగా మంగళవారం హుండీలను మరోసారి తెరచి భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. ఈ విడత రూ.1.12 కోట్లు వచ్చింది. మొత్తం రెండు విడతల్లో హుండీల ద్వారా రూ.2.93 కోట్ల ఆదాయం వచ్చింది.

ఐదేళ్లుగా.. అంతకు మించి..

కరోనా వ్యాప్తి చెందిన 2020 మినహా.. గడచిన ఐదేళ్లుగా సత్యదేవునికి కార్తికంలో వస్తున్న ఆదాయంలో క్రమంగా పెరుగుదల కనిపిస్తోంది. 2019 కార్తికంలో రూ.16,24,96,735 రాగా, కరోనా కారణంగా భక్తుల రాక తగ్గడంతో 2020 కార్తికంలో అది రూ.10,86,13,566కు తగ్గింది. తిరిగి 2021 కార్తికంలో రూ.18,95,63,603కు పెరిగింది. 2022లో అది మరో రూ.కోటి పెరిగి, రూ.19.95 కోట్లకు చేరింది. ఈ ఏడాది అంతకు మించి అత్యధికంగా ఏకంగా రూ.20.60 కోట్ల మేర ఆదాయం వచ్చింది. వ్రతాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.7.03 కోట్లు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.4.39 కోట్లు, హుండీల ద్వారా రూ.2.93 కోట్ల ఆదాయం వచ్చింది.

విఘ్నేశ్వరుని క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి దేవస్థానం నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మంగళవారం ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో అందరికీ శుభం జరగాలని ఆ గణేశుడిని ప్రార్థిస్తూ, ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. క్యాలెండర్‌ను ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆవిష్కరించారు. భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మకు.. ప్రగతి పూలమాల

- విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం
- జిల్లాలో 'మన బడి నాడు - నేడు'కు రూ.257 కోట్లు
- 'జగనన్న అమ్మ ఒడి'కి రూ.218.193 కోట్లు
- 1.14 లక్షల మందికి జగనన్న విద్యా కానుక
- 1.05 లక్షల మందికి పౌష్టికాహారం



రాయవరం మండలం వి.సావరంలో నాడు- నేడు పథకం కింద అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల



రాయవరం జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుకలు అందుకున్న విద్యార్థులు (ఫైల్)



రాయవరం: 'జీవితంలో యవ్వనం కన్నా.. ఆనంద డోలికల్లో తేలియాడే బాల్యం మిన్న' అన్నారో మహాకవి. అలాంటి బాలలకు విద్యాబుద్ధులు నేర్పి, రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అపురూప దేవాలయాలు పాఠశాలలు. అలాంటి బడులు గత టీడీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురయ్యాయి. శిథిలావస్థలో తరగతి గదులు.. విరిగిన బల్లలు.. అధ్వాన మరుగుదొడ్లు.. ఇలా అనేక అవస్థల మధ్య విద్యార్థుల చదువులు సాగేవి. ఈ పరిస్థితి మారాలని, విద్యార్థి ఎంతవరకూ చదివితే అంతవరకూ చదువుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. చదువుల విప్లవానికి నాంది పలికారు. విద్యతోనే పేదల భవిష్యత్తు మారుతుందని, అప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందనే మాటలను నిజం చేశారు. అందుకు అనుగుణంగా పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచాయి. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మరెంతో ప్రాధాన్యం ఇచ్చింది.

'నాడు-నేడు'.. రెండో దశ చూడు

మన బడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మొదటి దశలో ఇప్పటికే పాఠశాలలు సర్వాంగ సుందరంగా తయారవ్వగా.. రెండో దశలో జిల్లాలోని 761 పాఠశాలలు, 10 జూనియర్ కళాశాలలను ఎంపిక చేసి, వాటి అభివృద్ధికి రూ.257 కోట్లు మంజూరు చేశారు. 279 అదనపు తరగతి గదులు, 106 పాఠశాలలకు ప్రహరీలు నిర్మిస్తుండగా, మరో 660 పాఠశాలలను ప్రత్యేక మరమ్మతుల కింద అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.

విద్యా కానుక.. ప్రగతికి దీపిక

2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుకను విద్యార్థుల చేతికి అందజేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుంది. జూన్ 12న ప్రతి పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరిట మూడు జతల యూనిఫాం, పాఠ్య, రాత పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్స్, స్కూల్ బ్యాగ్, బెల్టు అందజేశారు. అలాగే ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు పిక్టోరల్ డిక్షనరీలు ఇచ్చారు. ఒక్కో విద్యాకానుక కిట్‌కు రూ.2,419 చొప్పున వెచ్చించారు. జిల్లాలో 1,14,833 మందికి జగనన్న విద్యా కానుకగా రూ.27.77 కోట్లు ఖర్చు చేశారు.

అమ్మ ఒడి.. చదువుల సవ్వడి

జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరానికి జగనన్న అమ్మ ఒడి పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి సొమ్ము వేశారు. మొత్తం 1,45,462 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేల చొప్పున రూ.218.193 కోట్లు జమ చేశారు.

బడి భోజనం.. బ్రహ్మాండం

విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రోజు విడిచి రోజు రాగిజావను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాగిజావను అమలు చేయడంతో పాటు విద్యార్థులు తాగేందుకు వీలుగా స్టీల్ గ్లాసులను సమకూర్చడం విశేషం. విద్యార్థులకు రుచిగా, శుచిగా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందజేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పక్కాగా మెనూను అమలు చేస్తుంది. రోజుకొక మెనూ, వారానికి మూడు రోజులు చిక్కీ, మూడు రోజులు రాగి జావ, వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా 1,573 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 1,05,698 మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోంది.

డిజిటల్ వెలుగులు

ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టారు. గత విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేయగా, ఈ ఏడాది డిజిటల్ విద్యలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధనలో భాగంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను (ఐఎఫ్‌పీ) ప్రభుత్వం సరఫరా చేసింది. అలాగే 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల కోసం స్మార్ట్ టీవీలు అందజేసింది. జిల్లా వ్యాప్తంగా 191 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 20,064 స్మార్ట్ టీవీలు, 142 పాఠశాలలకు 951 ఐఎఫ్‌పీలను సమకూర్చింది. అంతే కాకుండా ఐఎఫ్‌పీల ద్వారా బోధనపై జిల్లా వ్యాప్తంగా 4,174 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చింది.



జగనన్న గోరుముద్ద పథకంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

భద్రత కట్టుదిట్టం

విలువైన ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను సరఫరా చేసిన ప్రభుత్వం.. పాఠశాలల ఆస్తుల రక్షణకు కూడా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 224 ఉన్నత పాఠశాలల్లో 220 మంది నైట్ వాచ్‌మెన్‌ను నియమించింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో తాపీ కార్మికుడి మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో తాపీ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన మేడిశెట్టి శ్రీను (30) గుంటూరు జిల్లా గోరింట్ల వద్ద తాపీ పని చేసేందుకు వలస వెళ్లి భార్యతో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. పాయకరావుపేటలో ఉంటున్న తల్లిని చూసేందుకు సోమవారం అర్ధరాత్రి పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. ఎన్‌హెచ్‌పై స్థానిక రోడ్డు మెయింటెనెన్స్ యార్డు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంతో తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే శ్రీను మృతి చెందాడు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోకవరం: అచ్యుతాపురం శివారున పోలవరం కాలువలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోరుకొండ మండలం రాఘవపురానికి చెందిన బైరి గణపతి(30)కి వివాహమై, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య కువైట్‌లో ఉంటోంది. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న గణపతిని బంధువులు అచ్యుతాపురం తీసుకువచ్చారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ శివారున ఉన్న పోలవరం కాలువలో దూకి అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టానికి తరలించారు. ఎస్సై ఎంవీఆర్ రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

అమలాపురం టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కాటన్ పార్కులో అనాథ వృద్ధురాలు షేక్ ఖాసిం బీబీ (90) తీవ్ర అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కల్వకొలను బాబీలు మున్సిపల్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆ అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేసేందుకు సిద్ధమయ్యారు. అంతలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు మహ్మద్ అబ్దుల్ రబ్బాని, ఎండీ బషీర్ తదితరులు అక్కడకు చేరుకుని, తమ సంప్రదాయం ప్రకారం ఆ వృద్ధురాలి మృతదేహాన్ని ఖననం చేశారు. వారి మానవత్వాన్ని అందరూ అభినందించారు.

బాలల ప్రతిభ.. అదుర్స్

- ఆలోచింపజేసిన సైన్స్ ప్రాజెక్టులు
- జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 9 ఎంపిక
- రేపటి నుంచి కడపలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సు

రాయవరం: నిండా పదహారేళ్ల లోపే వయస్సున్న ఆ బాలలు గట్టి ఆలోచనలే చేశారు. వినూత్నంగా ఆలోచించి, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టుల తయారీలో తమదైన ప్రతిభను చూపారు. జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు వారు రూపొందించిన ప్రాజెక్టులు.. వీక్షకులనే కాదు.. న్యాయ నిర్ణేతలను సైతం ఔరా! అనిపించాయి. ఈ నెల 22, 23 తేదీల్లో రామచంద్రపురంలోని శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ సదస్సు సందర్శకులను ఆకట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా 88 పాఠశాలల నుంచి 93 ప్రాజెక్టులు ప్రదర్శించగా, విద్యార్థి వ్యక్తిగతం, విద్యార్థి గ్రూపు, ఉపాధ్యాయ విభాగాలు ఒక్కో దానిలో మూడేసి చొప్పున తొమ్మిది ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీటిని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన ఈ నెల 28, 29 తేదీల్లో వైఎస్సార్ కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నారు.

వ్యక్తిగత విభాగం

అగ్రికల్చరల్ ఇన్‌సెక్ట్ ట్రాపర్

విద్యార్థి పేరు: కేపీఎస్ఎస్ శ్రీరామ్
గైడ్ టీచర్: చొప్పల గోపి
పాఠశాల: జెడ్పీ హైస్కూల్, మామిడికుదురు



పంటలకు చీడపీడల నుంచి రక్షణ కల్పించి, పరోక్షంగా అధిక దిగుబడులు సాధించే విధంగా, పర్యావరణ హితంగా పంటకు హాని కలిగించే పురుగులను ట్రాపింగ్ చేసే విధానాన్ని పదో తరగతి విద్యార్థి శ్రీరామ్ రూపొందించారు. ఇది విద్యార్థి వ్యక్తిగత విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికవడంపై హెచ్‌ఎం చిట్టినీడి నిరంజని సంతోషం వ్యక్తం చేశారు.

వ్యర్థాలతోనే వ్యర్థాల శుభ్రం

విద్యార్థి పేరు: కె.లావణ్య
గైడ్ టీచర్: మేకా రామలక్ష్మి
పాఠశాల: శ్రీగౌతమి మున్సిపల్ హైస్కూల్, మండపేట



ముల్లును ముల్లుతోనే తీయాలన్న చందంగా వ్యర్థాలను వ్యర్థాలతోనే శుభ్రం చేయడంతో పాటు, పర్యావరణాన్ని పరిరక్షించేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌ను తగ్గిస్తూ, కాలుష్యానికి పరిష్కారం చూపుతూ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

సోలార్ సెన్సార్డ్ క్యాటిల్ షెడ్ ప్రాజెక్టు

విద్యార్థి పేరు: చింతా అనీల
గైడ్ టీచర్: కేవీఎస్‌ఏ లక్ష్మి
పాఠశాల పేరు: ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, అమలాపురం



అధిక సంఖ్యలో పశువులు పెంచే వారికి ఉపయోగపడేలా రూపొందించిన సోలార్ సెన్సార్డ్ క్యాటిల్ షెడ్ ప్రాజెక్టు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. పశువులకు సమయానుకూలంగా ఆహారం, నీరు అందించడం వలన మానవ వనరుల అవసరం తగ్గుతుంది. సోలార్ సిస్టమ్, సెన్సార్ల సహాయంతో పని చేసే ఈ ప్రాజెక్టు ద్వారా పశువుల వ్యర్థాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయవచ్చు. తక్కువ పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భావితరాలు పశువుల పెంపకంపై ఆసక్తి చూపిస్తారనడంలో సందేహం లేదు.

గ్రూపు విభాగం

ఆలోచింపజేసిన ఫ్యూచర్ రోడ్ టెక్నాలజీ

విద్యార్థులు: టి.గౌతమ్, పి.రాజేష్
గైడ్ ఉపాధ్యాయుడు: ఎం.బుజ్జిబాబు
పాఠశాల: జెడ్పీ హైస్కూల్, నేదునూరు, అయినవిల్లి మండలం



రోడ్డు ప్రమాదాల నివారణకు ఫ్యూచర్ రోడ్ టెక్నాలజీ పేరిట ఈ ప్రాజెక్టును విద్యార్థులు రూపొందించారు. స్మార్ట్ స్ట్రీట్ లైట్ సిస్టమ్ ద్వారా ప్రమాదాలు నివారించడం, వాహనాలు సురక్షితంగా చేరుకునేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైంది.

గజరాజుల నుంచి పంటను కాపాడేందుకు..

విద్యార్థులు: గుత్తుల అభిషేక్‌రాజు, వీరాల జ్యోతి
గైడ్ టీచర్: కె.రామకృష్ణమూర్తి
పాఠశాల పేరు: ఎస్ఐజీ మున్సిపల్ హైస్కూల్, చాకలిపేట, రామచంద్రపురం



అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో ఏనుగులు గుంపులుగా వచ్చి పంటలను పాడు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. వాటి నుంచి పంటలను ఎలా రక్షించుకోవాలో ప్రయోగపూర్వకంగా ఈ ప్రాజెక్టు రూపొందించారు. ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా అరబిందో - యునో సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ ప్రాజెక్టును విద్యార్థులు రూపొందించారు.

శ్రమ తగ్గించే యంత్రం

విద్యార్థులు: అమృతవర్షిణి, కావ్యశ్రీ
గైడ్ టీచర్: జీఎన్ సత్యనారాయణ
పాఠశాల పేరు: జెడ్పీ హైస్కూల్, వన్నెచింతలపూడి, అమలాపురం మండలం



రైతుల శ్రమను తగ్గించేలా.. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు వంటి పథకాల్లో ఉపయోగపడేలా.. ఈ ప్రాజెక్టును రూపొందించారు. గ్యాస్ బండలు, బియ్యం బస్తాలు, వాటర్ టిన్‌లను సులభంగా ఒక చోట నుంచి మరో చోటకు తీసుకునే వెళ్లేలా యంత్రాన్ని రూపొందించారు.

టీచర్ విభాగం

ఇన్నోవేటివ్ గణిత క్యాలెండర్

ప్రాజెక్టు రూపకర్త: గుబ్బల అరుణకుమారి, స్కూల్ అసిస్టెంట్ గణితం
పాఠశాల: జెడ్పీ హైస్కూల్, మేడిచర్లపాలెం, మలికిపురం మండలం



ప్రతి నెలలో ఒక్కో నంబరు కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ క్యాలెండర్‌లో ప్రధాన సంఖ్యలను ఒకటి నుంచి 1,000 వరకూ సులువుగా గుర్తించడం.. అలాగే మ్యాజిక్ స్క్వేర్స్ ఈజీగా వేయడం, మ్యాజిక్ గేమ్స్ వంటి వాటిని గుర్తించే విధానాన్ని పొందుపరిచారు. ఏ ఏడాదైనా తేదీ చెప్పగానే వారం వెంటనే చెప్పే విధంగా రూపొందించిన ఈ క్యాలెండర్ ఇన్నోవేటివ్ ప్రాజెక్టుగా ఉపాధ్యాయ విభాగంలో ఎంపికైంది.

ఆల్ ఇన్ వన్ మ్యాథ్స్ ప్రోబ్లమ్ సాల్వింగ్ వర్కింగ్ మోడల్


టీచర్ పేరు: పీవీ రవిప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు
పాఠశాల పేరు: జెడ్పీ హైస్కూల్, విలస, అయినవిల్లి మండలం



భూగోళంలో అన్ని అంశాలూ ఎలా ఇమిడి ఉన్నాయో.. అలాగే, గడియారం ద్వారా ఆరు నుంచి పదో తరగతి వరకూ ప్రధానమైన గణిత భావనలను తెలియజేసేలా దీనిని రూపొందించారు. ఈ వర్కింగ్ మోడల్ ద్వారా వృత్తాల భావన, అంతర, బాహ్య వృత్తం, స్పర్శరేఖలు, ఖండన రేఖలు, కోణాలు, జామెట్రీ, త్రికోణమితి, నిష్పత్తులు.. ఇలా పలు భావనలను గడియారం ద్వారా విద్యార్థులకు సులువుగా బోధించవచ్చు.

పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల అమరిక

టీచర్ పేరు: అబ్బిరెడ్డి రామకృష్ణ, స్కూల్ అసిస్టెంట్ (పీఎస్)
పాఠశాల: జెడ్పీ హైస్కూల్, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం



కాంతి రుజు మార్గంలో పయనిస్తుంది. క్రమ పరావర్తనం, అక్రమ పరావర్తనం, వక్రీభవనం, సందిగ్ధ కోణం, సంపూర్ణ అంతర పరావర్తనం తదితర 11 అంశాలను ఈ ప్రాజెక్టు ద్వారా వివరించారు. భౌతిక శాస్త్రంలో కాంతి ధర్మాల ఆధారంగా చేసే ప్రయోగాలను ఈ ప్రాజెక్టు ద్వారా వివరించారు. విద్యార్థులకు సులువుగా బోధించే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది.

క్రిస్మస్ వేడుకలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

రెండు మోటారు సైకిళ్లు ఢీ : ఇద్దరు మృతి



జె.కొత్తూరు వద్ద ప్రమాద స్థలంలో మృతదేహాలు, నుజ్జయిన మోటార్ సైకిళ్లు



మృతులు కర్రి రాజ్‌కుమార్ రెడ్డి, కోన సత్తిబాబు (ఫైల్)

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారులోని దుర్గ గుడి సమీపంలో మంగళవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్టు జగ్గంపేట సీఐ లక్ష్మణరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండపేట మండలం అర్తమూరుకు చెందిన కర్రి రాజ్‌కుమార్‌రెడ్డి (21), అతని మిత్రుడు గండి మణికంఠతో కలిసి ఈ నెల 25న గోకవరం మండలం కృష్ణునిపాలెం హాస్టల్ జరిగే క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యాడు. రాజ్‌కుమార్‌రెడ్డి గతంలో హాస్టల్‌లో చదువుకోవడంతో అక్కడి మిత్రులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. క్రిస్మస్ వేడకలు ముగియడంతో మంగళవారం ఉదయం రాజ్‌కుమార్‌రెడ్డి, మణికంఠ ఇద్దరూ కలిసి తమ స్వగ్రామం అర్తమూరు బయలు దేరారు. ఉదయం 9.30 గంటలకు జె.కొత్తూరు వద్ద ముందు వెళుతున్న ఆటోను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కర్రి రాజ్‌కుమార్‌రెడ్డితో పాటు ఎదురుగా మోటారు సైకిల్‌పై వస్తున్న కోన సత్తిబాబు (37)కు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కోన సత్తిబాబు మండలంలోని రాజపూడి గ్రామం నుంచి జగ్గంపేటలో గ్యాస్ బండ మార్చుకుని తిరిగి రాజపూడి వస్తున్న సమయంలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పాయాడు. మోటారు సైకిళ్లపై వెనుక కూర్చున్న అర్తమూరుకు చెందిన గండి మణికంఠ (24), రాజపూడికి చెందిన పల్లా భాస్కర్(15)కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడు కోన సత్తిబాబు భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గంపేట ఇన్‌చార్జి ఎస్సై వై.గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయింది

రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కోన సత్తిబాబుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజపూడిలో అత్తవారంటికి వచ్చి సత్తిబాబు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అబ్బాయి, అమ్మాయి చిన్నపిల్లలు. సత్తిబాబు మృతితో ఆ కుటంబానికి పెద్దదిక్కు లేకుండా పోయింది. పిల్లలతో ఎలా బతకాలి అంటూ అతని భార్య విలపించడం అందరిని కలిచి వేసింది.

రోశయ్య నేటి తరానికి మార్గదర్శకుడు

- ఉన్నత పదవులకు వన్నె తెచ్చారు
- వైఎస్సార్ సీపీ నేత శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం
- అమలాపురంలో కొణిజేటి విగ్రహం ఆవిష్కరణ



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్: మంత్రిగా, ముఖ్యమంత్రిగా, రెండు రాష్ట్రాల గవర్నర్‌గా.. ఇలా ఎన్నో ఉన్నత పదవులకు వన్నె తెచ్చిన కొణిజేటి రోశయ్య నేటి తరానికి మార్గదర్శకుడని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యాన స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైశ్యులు సామాజిక సేవల్లోనే కాకుండా రోశయ్యను ఆదర్శంగా తీసుకుని రాజకీయంగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు. రోశయ్య రాజకీయ విలువల గురించి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ వివరించారు. తొలుత వైశ్య నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటర్ నుంచి పాదయాత్రగా వాసవీ మాత ఆలయానికి చేరుకున్నారు. రోశయ్య విగ్రహ దాతలు, వైశ్య సంఘం ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, రాఘవ దంపతులను సంఘం తరఫున శివరామ సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించి, అభినందించారు. సభలో వైశ్య ప్రతినిధులు ముఖాలకు రోశయ్య మాస్కులు పెట్టుకుని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్ గోపి రాజీ, పట్టణ వైశ్య సంఘ పెద్దలు యెండూరి వెంకట్రామయ్య, నంబూరి సత్యనారాయణమూర్తి, వంకాయల కాశి, డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, వరదా సూరిబాబు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కు పాలించే సత్తా లేదు

- ఆదరణ లేకే జనసేన నుంచి బయటకు..
- 2024లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం
- విలేకరులతో మేడా గురుదత్త ప్రసాద్



రాజమహేంద్రవరం సిటీ: నాయకత్వ లక్షణాలు, స్థిరత్వం లేని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాష్ట్రాన్ని పరిపాలించే సత్తా లేదని జనసేన మాజీ ఇన్‌చార్జి మేడా గురుదత్త ప్రసాద్ అన్నారు. ఆదరణ లేకే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేనలో పవన్, నాదెండ్ల మనోహర్‌కు తప్ప మరొకరికి గుర్తింపులేదన్నారు. 16 ఏళ్లుగా ప్రజారాజ్యం, జనసేన పార్టీలలో నిబద్ధతతో పనిచేశారన్నారు. తనకు పవన్ కల్యాణ్‌ను కలిసే అవకాశం కూడా ఇవ్వలేదని, ఏమాత్రం ఆదరణ లేకపోవడంతో పార్టీ నుంచి బయటకు వచ్చినట్టు తెలిపారు. జనసేనలో పనిచేసే వారికి గుర్తింపు ఉండదని, అందుకే ఐపీఎస్ మాజీ అధికారి లక్ష్మీనారాయణ బయటకు వెళ్లి సొంత పార్టీ పెట్టుకుంటే, తోట చంద్రశేఖర్ బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనకు చెప్పకుండా ఆ బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీతో పొత్తు పెట్టుకుని చంద్రబాబును సీఎం చేయాలన్నదే పవన్ ఆలోచన అన్నారు. ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరానని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను బలపరుస్తూ ఆయన విజయానికి కృషి చేస్తానన్నారు.

పసికందు హత్య కేసులో జీవిత ఖైదు

సీతానగరం: పసికందు హత్య కేసులో తల్లి, అమ్మమ్మలకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి తీర్పు చెప్పారు. కోరుకొండ సీఐ జి.ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. చినకొండేపూడికి చెందిన 15 రోజుల పసికందు కనిపించడం లేదని తల్లి కాళ్ల సృజన, అమ్మమ్మ మల్లిరెడ్డి మహాలక్ష్మి, సృజన అమ్మమ్మ గంధం కనకరత్నం 2020 జూన్ 6న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. పసికందును తల్లి, అమ్మమ్మతో కలిసి సృజన బావిలో పడవేసి హత్య చేసినట్టు నిర్ధారణ అయ్యింది. ఆడపిల్ల పుట్టడంతో, భారం అని భావించి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు గుర్తించిన అప్పటి సీఐ పవన్ కుమార్‌రెడ్డి పైముగ్గురిపై హత్య కేసు నమోదు చేసి, జైలుకు పంపించారు. కేసు విచారణలో ఉండగానే గంధం కనకరత్నం మరణించింది. కోర్టు విచారణ అనంతరం సృజన, మహాలక్ష్మిలకు జీవిత ఖైదు, ఒకొక్కరికీ రూ.5 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు. ఈ కేసును పీపీ ఎంఏ బాషా వాదించగా, కోర్టు కానిస్టేబుళ్లు డి.లక్ష్మణరావు, ఎస్కే బీఎం షరీఫ్‌లు సాక్షులను సకాలంలో హాజరు పరిచారని సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు గురజనాపల్లి ప్రాజెక్టు



ఆర్‌జేడీ నాగమణి నుంచి మెమెంటో, ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థినులు, గైడ్ టీచర్

కరప: గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సాల్ట్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. కాకినాడలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించిందని హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిలు పి.జోష్ణవి, పి.హారికలు భౌతిక శాస్త్ర టీచర్ వెలుగుబంట్ల వెంకట రమణమూర్తితో గైడెన్స్‌లో 'ఉప్పు సాగులో సంక్షోభం, ఉప్పు రైతులకు ఆదాయాన్ని చేకూర్చే అనుసరణ వ్యూహాలు' అనే ప్రాజెక్టు రూపొందించారు. ఉప్పు రైతులతో ఇంటర్వ్యూలు, కేంద్ర ఉప్పు శాఖ అధికారులతో విశ్లేషణలు చేశారు. ఈ ప్రాజెక్టుకు మండల స్థాయిలో ప్రథమ, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించాయని రమణమూర్తి తెలిపారు. కడపలో గురువారం జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఈ ప్రాజెక్టు ఎంపికైందని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ, డీఈఓ నాగమణి, ఉప విద్యాశాఖాధికారులు రాజు, డి.సుభద్ర తదితరులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. విద్యార్థులను, గైడ్ టీచర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితరులు అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై నాగరాజు

నిడదవోలు: పట్టణంలోని గణపతి సెంటర్‌లో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలు సమీపాన ఓ ఇంటి వద్ద బలమైన ఇనుప గేట్లు గొంతు మీద పడి గుర్తు తెలియని వ్యక్తి (45) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సై పి.నాగరాజు మంగళవారం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వంశీకృష్ణ తన ఇంటి ప్రహరీకి రెండు పెద్ద ఇనుప గేట్లు తయారు చేయించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని ఆ వ్యక్తి దొంగతనానికి వచ్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఇంట్లోకి ప్రవేశించే క్రమంలో ఆ వ్యక్తిపై బరువైన ఆ రెండు ఇనుప గేట్లు పడ్డాయి. దీంతో అతడు మృతి చెంది ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. ఇనుప గేట్లను తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. సంఘటన స్థలాన్ని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ కూడా పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి వేలిముద్ర నిపుణులు వచ్చి వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ ఇంటి పరిసరాల్లో తచ్చాడింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి శివారు చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానిక పోలీసులు గుర్తించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చెరువులో మృతదేహం ఉన్నట్టు స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు, శరీరంపై ఎరుపు రంగు చొక్కా, నైట్ ప్యాంట్‌తో ఉన్నట్టు పేర్కొన్నారు. మృతదేహం వారం రోజులుగా నీటిలో ఉండటం వల్ల పూర్తిగా పాడైపోయి గుర్తు పట్టలేనిస్థితిలో ఉందన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

చదరంగం పోటీలు రేపు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో గురువారం మహిళల జిల్లా చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. స్థానిక అల్యూమినియం అసోసియేషన్ హాల్లో జరిగే ఈ పోటీల్లో మొదటి నలుగురు విజేతలు ఈనెల 31న రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఏపీచెస్ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో బుధవారం లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.